
# ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల సంస్కరణలు




ప్రచురణ

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**

ఆంధ్రప్రదేశ్ కమిటీ

# స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల పరిరక్షణకు ఎన్నికల వ్యవస్థను సంస్కరించాలి

"ఒకే ఓటు – ఒకే విలువ" సూత్రం ఆధారంగా దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మొదలైంది. మోడీ సారథ్యంలోని ప్రస్తుత పాలకుల చేతిలో అది దారితప్పి కార్పొరేట్ స్వామ్యం క్రింద మారుతోంది. ఒకేదేశం – ఒకే ఎన్నిక పేరుతో ఫెడరల్ రాజ్యాంగ వ్యవస్థను ధ్వంసం చేసి నిరంకుశ రాజ్యంగా మారుస్తున్నారు.

మన పూర్వీకులు కులమతాలకు, ప్రాంతాలకూ అతీతంగా జరిపిన త్యాగపూరిత పోరాటం వల్ల మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ఆ పోరాటంలో పాల్గొన్న వివిధ వర్గాల ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ డా॥ అంబేద్కర్ నాయకత్వంలో రాజ్యాంగ రూపకల్పన జరిగింది. మన దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే అనేక అంశాలను మన రాజ్యాంగ రూపకర్తలు అందులో పొందుపరిచారు. అటువంటి వాటిలో మన ఎన్నికల వ్యవస్థ ఒకటి. అత్యున్నత శాసన వ్యవస్థ అయిన పార్లమెంటు నుండి క్రింది స్థాయిలో స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికల దాకా ఆయా స్థాయిల్లో ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తాయి.

అయితే స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాల కాలంలో ఈ ఎన్నికల వ్యవస్థలో అనేక లోపాలు చొరబడి, ఇంతింతై వటుడింతై అన్నట్లు ఈనాడు ప్రజాస్వామిక ఎన్నికల వ్యవస్థనే అపహాస్యం చేసే స్థితికి చేరుకున్నాయి. బూర్జువా రాజకీయ పార్టీలు అయిదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికలను ఓట్ల అమ్మకం కొనుగోలు మార్కెట్‌గా మార్చేశాయి. అర్థబలం, అంగబలానికి ప్రాధాన్యత పెరిగి ఎన్నికల్లో ప్రజల ప్రాతినిధ్యం క్రమంగా తగ్గిపోతోంది. రాజకీయ పార్టీలకు వచ్చే ఓట్లకూ, సీట్లకూ మధ్య అసలు పొంతన లేకుండా పోతోంది. ఇదంతా మన ఎన్నికల ప్రక్రియను వికృతంగా మారుస్తోంది. దీనికి తోడు కేంద్రంలో

బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల సంఘం స్వయంప్రతిపత్తిని నాశనం చేసి దాన్ని తన రబ్బరు స్టాంపుగా మార్చుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఎన్నికల బాండ్ల పేరుతో అవినీతిని పెంచింది. చివరికి పార్లమెంటు ఎన్నికల నిష్పాక్షికతను ప్రశ్నార్థకంగా మార్చేసింది.

ఇటువంటి పరిస్థితుల్లో దేశంలో పెద్ద ఎత్తున ఎన్నికల సంస్కరణలు ప్రవేశపెట్టాల్సిన తక్షణ అవసరం ఏర్పడింది. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఒక బాధ్యతాయుతమైన రాజకీయ పార్టీగా ఈ సంస్కరణల గురించి పదేపదే నొక్కి చెబుతూ వస్తోంది. ఇటీవల గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలను కేంద్ర ఎన్నికల సంఘం చర్చలకు పిలిచినప్పుడు సిపిఐ (ఎం) గతం నుండీ తాను చెబుతూ వస్తున్న సంస్కరణలను ఎన్నికల సంఘం ముందుంచింది. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ నాయకత్వంలోని ముగ్గురు సభ్యుల బృందం ఈ ఏడాది మే 25న ఎన్నికల సంఘం ముందుంచిన విజ్ఞాపన పత్రం నిజానికి మనందరికీ ఒక అధ్యయన పత్రం. ఎందుకంటే ఎన్నికల వ్యవస్థలోని లోపాలను విమర్శించడంతో పార్టీ సరిపుచ్చలేదు. ప్రతి లోపాన్నీ వివరించడంతోపాటు దాన్ని ఎలా సంస్కరించవచ్చునో కూడా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సూచించింది. పౌరుల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కాపాడే సాధనంగా పార్లమెంటరీ వ్యవస్థ సుసంపన్నం కావాలి. అలాంటి ఉత్తమ ప్రజాస్వామ్య వ్యవస్థకోసం, నూతన రాజకీయ సంస్కృతికోసం నేటితరం పోరాడేందుకు ముందుకు రావాలని కోరుతున్నాను.

ఆ విజ్ఞాపన పత్రాన్ని ఈ చిన్న పుస్తకంలో ఇస్తున్నాం. పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, ప్రజలందరూ దీన్ని చదవాలి, అందులోని విషయాలను అధ్యయనం చేయాలి. సిపిఐ(ఎం) ప్రతిపాదించిన ఎన్నికల సంస్కరణలను సాధించుకోడానికి కృషి చేయాలి.

**08 జూన్, 2025** **వి. శ్రీనివాసరావు**

**రాష్ట్ర కార్యదర్శి**

**సిపిఐ(యం), ఆంధ్ర ప్రదేశ్ కమిటీ**

# కేంద్ర ఎన్నికల కమిషన్ కు సిపిఐ (ఎం) విజ్ఞాపన

2025 మే 10వ తేదీన ఎన్నికల కమిషన్ లోని ముగ్గురు సభ్యులనూ సిపిఐ(ఎం) ప్రతినిధివర్గం కలిసి దిగువ విజ్ఞాపనను సమర్పించింది. ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలనూ ఈ విధంగా సంప్రదింపులకు ఆహ్వానించింది. సిపిఐ(ఎం) ప్రతినిధి బృందంలో ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీతో బాటు పొలిట్ బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు, కేంద్ర కమిటీ సభ్యులు మురళీధరన్ ఉన్నారు.

## విజ్ఞాపన

గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలను చర్చల కోసం ఆహ్వానించిన ఎన్నికల కమిషన్ చొరవను ఆహ్వానిస్తున్నాం. ఈ విధమైన సంప్రదింపులు, కలుసుకోవడం తరచూ జరిగే ప్రక్రియగా ఉంటుందని ఆశిస్తున్నాం.

ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు ముఖ్యమైన అంశాలను, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించి మరింత బలపరిచే అంశాలను భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) గత కొంత కాలంగా లేవనెత్తుతూనే వుంది. గత కొన్ని సంవత్సరాలుగా ఆయా సందర్భాలలో మేము వ్యక్తం చేస్తూ వచ్చిన అభిప్రాయాలను మళ్ళీ ఇక్కడ మీ ముందు సమర్పిస్తున్నాం.

ఇసికి ఉన్న పరిధిని, పరిమితులను గమనంలో ఉంచుకుంటూనే, మేము ఇసి తన అధికారాలను, స్థానాన్ని పరిస్థితులపై సానుకూల ప్రభావం పడేలా సాధ్యమైనంతమేరకు వినియోగిస్తుందని ఆశిస్తున్నాం. అందుచేత ఇక్కడ మేము కొన్ని పెద్ద సమస్యలను చర్చల నిమిత్తం లేవనెత్తేందుకు స్వతంత్రిస్తున్నాం.

సిపిఐ(ఎం) అవగాహన ప్రకారం ఎన్నికల సంస్కరణలు సమగ్రంగా చేపట్టాలి. ఇవిఎంలు, ఎన్నికల నిధులు, అవినీతి, కార్పొరేట్ల పెత్తనం, పాక్షిక దామాషా ప్రాతినిధ్యం, ఎన్నికల సంస్థల నిష్పాక్షిక, స్వతంత్ర స్వభావం, మీడియా పాత్ర వంటి అంశాల గురించి వ్యక్తం అవుతున్న ఆందోళనలను, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునేలా ఆ సంస్కరణలు ఉండాలి.

## పాక్షిక, దామాషా ప్రాతినిధ్యం

ప్రస్తుతం అమలులో ఉన్న విధానం ప్రకారం అభ్యర్థులలో తక్కినవారి కన్నా ఎక్కువ వోట్లు సాధించిన అభ్యర్థిని గెలిచినట్టు పరిగణిస్తారు. ఐతే రాను రాను ఈ విధానం విస్తృత ప్రజాభిప్రాయాన్ని వ్యక్తం చేయడంలో పనికిరాకుండా పోతోందని భావిస్తున్నాం. ఆయా రాజకీయ పార్టీలకు పడిన వోట్లు, వాటికి వచ్చిన సీట్లు – రెండింటికీ అంతకంతకూ పొంతన లేకుండా పోతున్నది.

ఇటీవల జరిగిన ఎన్నికల అనుభవాలను చూస్తే రాజకీయ పార్టీలు పొందిన వోట్లకు, అవి గెలుచుకున్న సీట్లకు మధ్య నిష్పత్తి చాలా తేడాగా ఉంది. వోట్లలో ఎక్కువ శాతం గెలుచుకున్న పార్టీలు ఆ వోట్లకు అనుగుణంగా సీట్లను గెలుచుకోలేకపోతున్నాయి. వాటికన్నా తక్కువ శాతం వోట్లు తెచ్చుకున్న పార్టీలకు ఎక్కువ సీట్లు వచ్చాయి.

**ఉదాహరణకు :** 2014 ఎన్నికలలో బిజెపికి కేవలం 31 శాతం వోట్లు మాత్రమే వచ్చాయి. కాని ఆ పార్టీకి లోక్‌సభ స్థానాలలో సగం కన్నా ఎక్కువే వచ్చాయి. దానితో పోల్చితే 19.3 శాతం వోట్లు తెచ్చుకున్న కాంగ్రెస్ పార్టీకి కేవలం 44 సీట్లు మాత్రమే వచ్చాయి. 2024 ఎన్నికలలో బిజెపి 36.56 శాతం వోట్లతో 240 సీట్లు గెలుచుకుంది. కాని మునుపటికన్నా కేవలం 1.89 శాతం వోట్లను మాత్రమే అధికంగా పొందిన కాంగ్రెస్ 2014 కన్నా 55 సీట్లను అధికంగా గెలుచుకుంది.

## కొన్ని రాష్ట్రాలను పరిశీలిస్తే :

ఉత్తరప్రదేశ్ లో 2024 లోక్‌సభ ఎన్నికలలో బిఎస్‌పికి 9.39 శాతం వోట్లు వచ్చాయి కాని ఒక్క సీటూ దక్కలేదు. అదే 9.46 శాతం వోట్లు తెచ్చుకున్న కాంగ్రెస్ కు 6 సీట్లు వచ్చాయి.

ఒడిశాలో 45.34 శాతం వోట్లు తెచ్చుకున్న బిజెపికి 20 స్థానాలు దక్కాయి. అదే 37.53 శాతం వోట్లు తెచ్చుకున్న బిజెడికి ఒక్క స్థానమూ దక్కలేదు. 12.52 శాతం వోట్లు వచ్చిన కాంగ్రెస్‌కు ఒక్క స్థానం దక్కింది.

ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్‌ఆర్‌సిపికి 39.61 శాతం వోట్లు వచ్చినా 4 స్థానాలు మాత్రం దక్కాయి. అదే 37.79 శాతం వోట్లు తెచ్చుకున్న టిడిపికి నాలుగు రెట్లు అదనంగా, 16 స్థానాలు దక్కాయి.

డిల్లీలో బిజెపి 54.35 శాతం వోట్లతో అక్కడి 7 స్థానాలనూ గెలుచుకుంది. ఆప్‌కు 24.17 శాతం, కాంగ్రెస్‌కు 18.91 శాతం వోట్లు వచ్చినా ఆ రెండు పార్టీలకూ ఒక్క స్థానమూ దక్కలేదు.

2024 అసెంబ్లీ ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్‌ఆర్‌సిపికి 39.37 శాతం వోట్లు వచ్చినా కేవలం 11 స్థానాలు మాత్రమే దక్కాయి. ఆ పార్టీ కన్నా కేవలం 6 శాతం మాత్రమే ఎక్కువ వోట్లు తెచ్చుకున్న టిడిపికి 135 స్థానాలు దక్కాయి. కేవలం 2.83 శాతం వోట్లు పొందిన బిజెపికి 8 స్థానాలు వచ్చాయి. ఒడిశాలో బిజెడికి బిజెపి కన్నా కొద్దిగా ఎక్కువ శాతమే ఓట్లు వచ్చాయి. కాని ఆ పార్టీకి 51 సీట్లు మాత్రమే వస్తే బిజెపికి 78 సీట్లు వచ్చాయి.

మా అభిప్రాయాన్ని బలపరచడానికి ఈ ఉదాహరణలు సరిపోతాయని భావిస్తున్నాం.

కొన్ని చిన్న పార్టీలకు ఎక్కువ నియోజకవర్గాలలో గణనీయమైన పునాది ఉన్నప్పటికీ, వాటి వోట్ల శాతం గణనీయంగా ఉన్నప్పటికీ, అవి ఒక్క సీటును కూడా గెలుచుకోలేకపోవచ్చు. వోట్ల శాతంలో ఒక్కోసారి కొద్ది పాటి తేడా వచ్చినా దాని వలన అవి పొందే సీట్ల సంఖ్య అమాంతం మారిపోవచ్చు.

ఈ అసంబద్ధతను సరి చేయడానికి, ప్రజాతీర్పును కొంతమేరకైనా సక్రమంగా వ్యక్తం అయేట్లు చేయడానికి దామాషా పద్ధతిన ప్రాతినిధ్యం ఉండాలని, అందుకు పాక్షిక జాబితా విధానం అమలు కావాలని మేము కొంతకాలంగా సూచిస్తూ వస్తున్నాం.

ఈ సందర్భంగా గతంలో లా కమిషన్ చేసిన సూచనను మీ దృష్టికి తెస్తున్నాం. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను యథాతథంగా కొనసాగిస్తూ, అదనంగా సీట్ల సంఖ్యను 25 శాతం మేరకు పెంచి వాటిని పాక్షిక జాబితా విధానం ద్వారా దామాషా పద్ధతిన ఎన్నికలు జరిపి నింపాలని లా కమిషన్ సూచించింది. ఇదే విధమైన విస్తరణను రాష్ట్రాల అసెంబ్లీలలో కూడా చేపట్టవచ్చు. ఈ సూచనను మొదటి దశలో అమలు చేసి ఆ తర్వాత దామాషా పద్ధతిన నింపే సీట్ల సంఖ్యను పెంచవచ్చు.

ఇక డీ లిమిటేషన్ ప్రతిపాదన గురించి, దానిని అమలు చేయడానికి అనుసరిస్తున్న పద్ధతి గురించి చాలా సమస్యలు, ఆందోళనలు ఉన్నాయి. వాటన్నింటినీ ఇక్కడ మేం లేవనెత్తదలుచుకోలేదు.

## జమిలి ఎన్నికలకు వ్యతిరేకం

'ఒకే దేశం – ఒకే ఎన్నిక' అనే భావనను సిపిఐ (ఎం) వ్యతిరేకిస్తున్నది. దీని లక్ష్యం ఒక కేంద్రీకృత, యూనిటరీ రాజ్యాన్ని నెలకొల్పడమేనని భావిస్తున్నది.

ఒకే దేశం – ఒకే ఎన్నిక అనే ప్రతిపాదన కొన్ని రాష్ట్రాల అసెంబ్లీల పదవీకాలాన్ని కుదించి లోక్‌సభ ఎన్నికలతో పాటే నిర్వహించాలని లక్ష్యం చేసుకున్నది. ఒక వేళ ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం పడిపోతే, అసెంబ్లీని రద్దు చేయవలసివస్తే, అప్పుడు మధ్యంతర ఎన్నికలను ఆ మిగిలిన పదవీ కాలానికి మాత్రమే నిర్వహిస్తారు.

ఒకే దేశం – ఒకే ఎన్నిక నమూనా రాజ్యాంగంలోని ప్రజాస్వామ్యం, ఫెడరలిజం అనే రెండు మౌలిక స్వభావాలను దెబ్బ తీస్తుంది. కేశవానంద భారతి కేసులో సుప్రీం కోర్టు చాలా స్పష్టంగా ఇచ్చిన తీర్పు ప్రకారం రాజ్యాంగపు మౌలిక నిర్మాణాన్ని మార్చు అధికారం పార్లమెంటుకు లేదు.

## ఎన్నికల హామీల గురించి

ఒక రాజకీయ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో ఇచ్చే హామీలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రజాలకు ఆర్థిక సహాయంగా పరిణమిస్తాయి గనుక అటువంటి హామీలను అవినీతికర చర్యలుగా పరిగణించాలని చేసిన వాదనను శశాంక జె శ్రీధర కు, బి జడ్ జమీర్ అహ్మద్ ఖాన్‌కు మధ్య నడిచిన వ్యాజ్యం సందర్భంగా సుప్రీం కోర్టు తిరస్కరించింది. అదే సమయంలో రాజకీయ పార్టీలు తాము ఎన్నికల ప్రణాళికల్లో

ఇచ్చే హామీలను నెరవేర్చేందుకు కావలసిన ఆర్థికవనరులను ఎక్కడెక్కడినుండి సమీకరించదలిచారో నిర్దిష్టంగా తెలపాలని  సూచించింది.

పైకి చూస్తే ఇది మంచిగానే అనిపించవచ్చు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీ తనం ఉండవలసిన అవసరాన్ని నొక్కిచెప్పినట్టు అనిపించవచ్చు. కాని రాజకీయ పార్టీలు తమ విధానాలను, కార్యక్రమాలను. హామీలను స్వేచ్ఛగా ప్రజలముందు వెల్లడించే హక్కుకు ఈ సూచన భంగం కలిగిస్తుంది. ఏ అధికార వ్యవస్థగాని, సంస్థగాని  రాజకీయపార్టీ వ్యవస్థ మూలాలను దెబ్బ తీసేందుకు అవకాశం కల్పిస్తే అది స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు జరగడాన్ని దెబ్బ తీస్తుంది.

ఇంతకు ముందే మేము ఈ విషయంలో ఎటువంటి చట్టాన్నైనా చేయడాన్ని వ్యతిరేకించాము. 'రాజకీయ పార్టీలు, అభ్యర్థులు అనుసరించవలసిన నియమావళి' లో ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు కూడా భాగంగా ఉన్నందువల్ల వేరే చట్టం చేయనవసరం లేదు.

## ధనబలం పాత్ర

ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయడంలో ధనం పోషిస్తున్న పాత్ర మరొక ముఖ్యమైన అంశం. ప్రజల భవిష్యత్తును, విధానాలను నిర్ణయించే చట్ట సభల్లో రాను రాను ధనవంతులే ఎక్కువగా సీట్లు పొందగలుగుతున్నారు. ఇది చాలా ఆందోళన కలిగించే అంశం. అసెసియేషన్ ఫర్ డెమాక్రటిక్ రిఫార్మ్స్ అనే సంస్థ నివేదిక ప్రకారం 2024 లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో ఏకంగా 93 శాతం కోటీశ్వరులే గెలుపొందారు !

పోటీలో ఉన్న అభ్యర్థులందరికీ సమానమైన అవకాశాలు ఉండాల్సిన స్థితి ధన బలం కారణంగా లేకుండా పోతోంది. ప్రజాస్వామ్యం మీద ఆధారపడిన రాజకీయ వ్యవస్థకు పునాది స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఎన్నికలు జరగడం. కాని ఆ క్రమాన్నే ధన బలం దెబ్బ తీస్తోంది. ఆర్థికంగా పైచేయి కలిగివుంటే అది ఎన్నికలలో అదనపు బలంగా పని చేస్తోంది. ఎక్కువ ఆర్థిక వనరులు కలిగివున్న పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల్లో గెలవడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. బాగా విస్తరించివున్న నల్ల ధనం, లంచగొండితనం, 'నువ్వు నాకు ఈ పని చేస్తే నేను నీకు ఇంత ఇస్తా ( (క్విడ్ ప్రో కో) అనే పద్ధతి వంటివి పాటించే అభ్యర్థుల దగ్గర ప్రచారానికి నిధులు కావలసినంత పోగుబడుతున్నాయి.

"ఎన్నికల ఖర్చులపై అదుపు లేకపోవడం కాని, ఉన్న అదుపు నామమాత్రం కావడం వలన కాని అధికారం చేజిక్కించుకోవడం అనేది రెండు రకాలుగా జరుగుతోంది. మొదటిది: ప్రైవేటు పరిశ్రమాధిపతులు, ప్రైవేటు వ్యక్తులు ధనబలాన్ని ఉపయోగించి ఎన్నికల ఖర్చు మీద అదుపు నామమాత్రంగా ఉండేలా చేస్తూ, ఎన్నికల్లో ధనాన్ని ఖర్చు చేస్తున్నారు. ఆ ప్రయోజనం పొందిన వారి నుండి ఎన్నికల అనంతరం తమకు అనుకూలంగా విధానాలు రూపొందేట్టు చూసుకుంటున్నారు. ఇక రెండవది మరింత లోతైనది. తమ సంఖ్యా బలానికి పలు రెట్లు మించిపోయిన ప్రభావం కలిగివున్న ధనవంతులు తమ స్వార్ధ ప్రయోజనాలను నెరవేర్చుకోడానికి కేవలం నియంత్రణ వ్యవస్థను ప్రభావితం చేయడమే కాక, సామాన్య ప్రజానీకపు అభిప్రాయాలను కూడా 'ప్రజా ప్రయోజనం' అన్న పేరుతో తమకు అనుకూలంగా ప్రభావితం చేస్తున్నారు" అని ఎన్నికల సంస్కరణలపై ఇచ్చిన నివేదికలో లా కమిషన్ చాలా ఘాటుగా విమర్శించింది.

ఫిబ్రవరి 2024లో సుప్రీం కోర్టు ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధం అని తీర్పు చెప్పింది. ఆ స్కీము "పూర్తిగా ఏకపక్షం" అని, పరిమితులు లేని విరాళాలు "ఎన్నికల ప్రక్రియ పై కంపెనీలకు అవధులు లేని ప్రభావాన్ని కలిగించే శక్తిని ఇస్తాయి" అని , స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఎన్నికలు జరగడాన్ని ఎన్నికల బాండ్లు నిరోధిస్తాయని ఆ తీర్పు పేర్కొంది. ఆ స్కీము ఎంతమాత్రమూ "లోపరహితం" కాదు అని చెప్తూ "నువ్వు నాకు ఈ పని చేస్తే నేను నీకు ఇంత ఇస్తా" అనే ఏర్పాటును ఎన్నికల బాండ్లు కల్పిస్తాయని, దాని వలన చట్ట సభల సభ్యులను ప్రభావితం చేసి వారి ద్వారా "తమకు అనుకూలంగా విధానాలను రూపొందించేలా " చేయగల పరిస్థితి ఏర్పడుతుంది అని సుప్రీం కోర్టు ప్రకటించింది.

## పార్టీల, అభ్యర్థుల ఎన్నికల ఖర్చును ప్రభుత్వమే భరించాలి

ఎన్నికలలో బడా ధనవంతుల ప్రభావాన్ని, దానితో ముడిపడివున్న లంచగొండితనాన్ని, లాబీయింగ్‌ను, వ్యవస్థీకృత అవినీతిని, వోటర్లను ప్రభావితం చేయడాన్ని అదుపు చేయడానికి చాలా దేశాల్లో ప్రజాధనంతోటే, లేదా ప్రభుత్వ ధనంతోటే మొత్తం ఎన్నికల ప్రచారాన్ని కూడా నిర్వహించే పద్ధతి అమలు చేస్తున్నారు.

జర్మనీ ఉదాహరణను చూద్దాం. అక్కడ గత ఎన్నికలలో కేంద్ర, రాష్ట్ర చట్ట సభలలో వివిధ పార్టీలకు వచ్చిన సీట్లు, వోట్లు బట్టి ఆ పార్టీలకు ఎన్నికల నిధులను

ఉమ్మడి నిధి నుండి కేటాయిస్తారు. అంతేగాక, ఆయా పార్టీల బలాలకు అనుగుణంగా టివి చానెళ్ళలో వాటికి ప్రచార సమయాన్ని కేటాయిస్తారు.

దినేశ్ గోస్వామి, ఇంద్రజిత్ గుప్తా కమిటీ ఎన్నికల ఖర్చును పాక్షికంగా ప్రభుత్వం భరించాలని చేసిన సిఫార్సులను సిపిఐ(ఎం) బలపరుస్తుంది. వస్తురూపేణా ప్రభుత్వం అందించే తోడ్పాటు పాక్షికంగా అన్ని పార్టీలకు, అభ్యర్థులకు పోటీ పడగల పరిస్థితిని కల్పించగలుగుతుంది.

## రాజకీయ పార్టీలు చేసే ఖర్చు పై పరిమితిని సవరించాలి

దీనితోబాటే ముడిపడివున్న అంశం ప్రస్తుతం రాజకీయ పార్టీలు ఎన్నికలలో చేసే ఖర్చు పై పరిమితి లేకపోవడం. ప్రజాప్రాతినిధ్య చట్టం లోని 77వ సెక్షన్ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు చేసే ఖర్చు పై పరిమితి విధించింది. అటువంటి పరిమితి ఏదీ ఒక పార్టీ మొత్తంగా ఎన్నికల ప్రచారం కోసం చేసే ఖర్చు మీద లేదు. పార్టీగా చేసే ఖర్చు మీద పరిమితి లేనప్పుడు అభ్యర్థి చేసే ఖర్చు మీద విధించిన పరిమితికి అర్థం ఉండదు. బ్రిటన్ , తదితర దేశాలలో ఉన్నట్టు ఇక్కడ కూడా రాజకీయ పార్టీలు ఎన్నికలలో చేసే ఖర్చు మీద పరిమితిని విధిస్తూ ప్రజాప్రాతినిధ్య చట్టానికి తగిన సవరణలను చేయాలి.

అభ్యర్థి ఎన్నికల నామినేషన్ వేసినప్పటినుంచి మాత్రమే అతడి లేదా ఆమె ఖర్చు మీద పరిమితి వర్తిస్తుంది. అది ఎన్నికల ఫలితాలు వెలువడేంతవరకూ ఉంటుంది. కాని వాస్తవంగా ఎన్నికల నిమిత్తం చేసే ఖర్చు నామినేషన్ వేసేనాటికన్నా చాలా ముందునుంచే జరుగుతుంది. అందుచేత ప్రజాప్రాతినిధ్య చట్టం లోని సెక్షన్ 77 లో ఉన్న ప్రస్తుత లోపాన్ని సవరించేలా తగు సవరణలు తేవాలి.

ప్రాణానికి ముప్పు ఉందనో, భద్రతా సమస్యలు ఉన్నాయనో కొందరు ప్రముఖులకు ప్రభుత్వ విమానాలలో, ఇతర ప్రభుత్వ వాహనాలలో ఉచితంగా ఎన్నికల ప్రచారం నిమిత్తం తిరగడానికి అనుమతిస్తున్నారు. ఇది వారికి తక్కిన అభ్యర్థుల కన్నా అదనపు పట్టు కల్పిస్తుంది. అది న్యాయం కాదు.

## మీడియా పాత్ర

మీడియా యాజమాన్యాలుగా ఉన్న బడాసంస్థలు, గ్రూపులు పాలక పార్టీలకు సహాయపడతాయన్నది అందరికీ తెలిసినదే. 2014 అనంతర కాలంలో ఈ ధోరణి

మరీ కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది. స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఎన్నికలు జరగడానికి ఇది ఆటంకంగా ఉంటోంది. మీడియా ద్వారా అవాస్తవాలతో, నిరాధార ప్రచారాలతో రాజకీయ పార్టీల, అభ్యర్థుల సచ్ఛీలత పై బురద జల్లే సందర్భాలు చాలా ఉన్నాయి. ఈ రంగంలో తగిన నియంత్రణ అమలు జరిపే ఏర్పాటు అవసరం. అటువంటి నియంత్రణ సోషల్ మీడియా పై కూడా ఉండాలి. ప్రస్తుత కాలంలో అదే ఎక్కువ ప్రభావాన్ని చూపగలుగుతోంది.

వాయుతరంగాల వాడకంలో ప్రైవేటు రంగానికి అనుమతించడం జరిగాక వార్తారంగాన్ని ప్రైవేటు వార్తా చానెళ్ళే శాసిస్తున్నాయి. ఎన్నికలలో నిష్పక్షపాతంగా అన్ని రాజకీయ పార్టీలకూ సమాన అవకాశాలు ఉండేలా చేయాలంటే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అన్ని ప్రైవేటు మీడియా చానెళ్ళలోనూ వారి అభిప్రాయాలకు వ్యక్తం చేయడానికి అవకాశం కల్పించాలి.

## ఇవిఎంలు, వివిపాట్‌లు

ప్రజాక్షేత్రంలో ఇవిఎంలను దుర్వినియోగపరచవచ్చుననే అనుమానాలు పెరుగుతున్నప్పటికీ, గతంలో సిపిఐ(ఎం) ఇవిఎంలను ఉపయోగించడాన్ని సమర్థించింది. అదే విధంగా వివిపాట్‌లను ప్రవేశపెట్టడానికి కూడా మద్దత్తు ఇచ్చింది. ఐతే ఇప్పటికీ ప్రజలలో పలు తరగతులలో ఈ విషయమై అనుమానాలు ఇంకా కొనసాగుతూనే వున్నాయి.

**ప్రస్తుతం వోటింగ్ యంత్రాలను అమర్చే విధానం ఈ విధంగా ఉంది :** మొదట బ్యాలట్ యూనిట్, ఆ తర్వాత వివిపాట్, ఆ తర్వాత ఆఖరున కంట్రోల్ యూనిట్ ఉంటాయి. ఒకసారి ఓటరు తన ఓటును వేసిన తర్వాత ఆ ఓటరు ఎవరిని ఎంచుకున్నదీ వివిపాట్ మీద కనిపిస్తుంది. ఐతే, ఓటరు ఎంచుకున్నఅభ్యర్థికి మాత్రమే ఆ ఓటు నమోదౌతుందా లేదా అన్నది అనుమానాస్పదంగా ఉంటోంది. ఎందుకంటే వాస్తవంగా ఓటు నమోదయేది కంట్రోల్ యూనిట్‌లో. అందుచేత కంట్రోల్ యూనిట్ తర్వాత వివిపాట్‌ను అమర్చాలని మేము, ఇంకా చాలా మంది ఇతరులు సూచిస్తున్నాం. ఆ విధంగా చేయడం వలన వోటింగ్ నమోదయే ప్రక్రియ పట్ల ఉండే సందేహాలు నివృత్తి అవుతాయి.

ఈ మార్పు చాలా ముఖ్యమైనది. ఎందుకంటే వివిపాట్‌లను ప్రవేశపెట్టాక ఓటింగ్ పద్ధతికి ఒక ప్రత్యేకమైన బలహీనత ఏర్పడింది. ఈ వివిపాట్‌లను ప్రవేశపెట్టకముందు రోజుల్లో ఇవిఎంల నిక్కచ్చితనాన్ని ఎవరూ సందేహించనవసరం లేదని, ఎందుకంటే ఆ ఇవిఎం యంత్రానికి అమర్చిన చిప్‌లో అభ్యర్థుల గుర్తులకు, పేర్లకు సంబంధించిన సమాచారం ఏమీ ఉండదని, ఆ కారణంగా ఇవిఎంలో ఏమి నమోదైందో అది కౌంటింగ్ సమయంలో మాత్రమే వెల్లడౌతుందని చెప్పేవారు. ఐతే ఇప్పుడు వివిపాట్‌లను ప్రవేశపెట్టాక ఆ వాదన చెల్లదు. ఎందుకంటే ఇప్పుడు ఇవిఎం యంత్రం చిప్‌లో అభ్యర్థులకు, వారి గుర్తులకు సంబంధించిన ముందస్తు సమాచారం నిక్షిప్తమై ఉంటుంది. ఈ విధంగా అభ్యర్థుల పేర్లను, వారి గుర్తులను, బ్యాలట్‌లో అభ్యర్థుల వరుసక్రమాన్ని సంధానం చేస్తూ వివిపాట్‌లను పని చేయించడం ఇప్పుడు ప్రైవేట్ సంస్థల ద్వారా జరుగుతోందని వాస్తవాలు తెలియజేస్తున్నాయి. అందుచేత వివిపాట్‌ను ముందుగా తారుమారు చేసి తర్వాత దానిని కంట్రోల్ యూనిట్‌కు అనుసంధానం చేస్తే అప్పుడు రికార్డు అయిన వోట్లు కూడా తారుమారు అయే వీలుంది. అందుచేత మేము ఈ విధంగా సూచించదలుచుకున్నాము :

(అ) ఓటింగ్ ప్రక్రియలో ఉండే మూడు యంత్రాల అమరిక వరుస క్రమాన్ని మార్చడం. ముందుగా ఓటరు ఎంపికకు అనుగుణంగా ఇవిఎం నుండి కంట్రోల్ యూనిట్‌లో రికార్డు అయిన తర్వాత ఆ రికార్డు అయినది వివిపాట్ పైన కనిపించేలా చేయడం జరగాలి.

(ఆ) ప్రతీ బూత్‌లోనూ వివిపాట్‌ల పై కనిపించే సమాచారాన్ని 100 శాతమూ ఇవిఎంలో రికార్డు అయిన సమాచారంతో సరిచూడడం జరగాలి.

(ఇ) తగిన ముందస్తు జాగ్రత్తలు అమలు జరిగేలా, ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు ఎవరూ ఓటింగ్ యంత్రాల తయారీలో గాని, డిజైనింగ్‌లో గాని, నిర్వహణలో కాని, రిపేర్లు చేయడంలో కాని భాగస్వాములు కాకుండా మార్గదర్శకాలు కొత్తగా జారీ చేయాలి.

## పోలింగ్ సమాచారంలో వైరుధ్యాలు

పోలింగ్ వివరాలకు సంబంధించి చాలా తేడాలు తలెత్తుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల కమిషన్ తన వెబ్‌సైట్‌లో పోలింగ్ వివరాలను ఎప్పటికప్పుడు తాజాపరచడంలో జరుగుతున్న ఆలస్యం ఈ ఆరోపణలకు చాలా ఎక్కువ అవకాశం ఇచ్చింది. 2024 లోక్‌సభ ఎన్నికల మొదటి దశకు సంబంధించి ఎన్నికల

కమిషన్ తన వెబ్ సైట్ మీద గణాంక వివరాలను తాజా పరచడానికి ఏకంగా 11 రోజులు పట్టింది. రెండో దశలో నాలుగు రోజులు పట్టింది. పోలింగ్ ముగిసిన వెంటనే విడుదల చేసిన గణాంకాలకు, ఖరారు చేసిన అనంతరం ఫైనల్‌గా విడుదల చేసిన గణాంకాలకు మధ్య చాలా తేడాలు ఉన్నాయి. దాంతో అనుమానాలు బలపడుతున్నాయి.

మొదటి, రెండవ దశ ఎన్నికలలో (ఏప్రిల్ 19, ఏప్రిల్ 26 తేదీలలో) ఎన్నికల రోజున సాయంత్రం 7 గంటల వరకు నమోదైన ఓటర్లలో సుమారు 60 శాతం తమ ఓట్లను వేశారని ఎన్నికల కమిషన్ ఉజ్జాయింపుగా అంచనా వేసింది. ఏప్రిల్ 30 న తాజాపరిచిన సమాచారం అది 66.14, 66.71 శాతాలుగా చూపుతోంది.

ఉజ్జాయింపు అంచనాకు, తుది లెక్కకు మధ్య తేడా ఉంటుందని ఎవరైనా అంగీకరిస్తారు. కాని ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఫారం 17–సి లోని మొదటి భాగాన్ని నియోజకవర్గంలో పోలింగ్ పూర్తి అయిన వెంటనే నింపి అప్‌లోడ్ చేసే విధంగా నిబంధనలను సవరించడం ఈ పరిస్థితిలో ఎంతైనా సమంజసంగా ఉంటుంది. ఒకసారి ఫలితాలు వెలువడ్డాక వెంటనే రెండవ భాగాన్ని కూడా అప్‌లోడ్ చేయాలి. శాతాల్లో వివరాలు ఇచ్చే బదులు వాస్తవ అంకెలనే పొందుపరచడం ఈ విషయంలో తలెత్తుతున్న సందేహాల నివృత్తికి తోడ్పడగలదు.

మహారాష్ట్రలో కేవలం ఆరు నెలల వ్యవధిలో జరిగిన ఎన్నికలలో ఓటర్ల సంఖ్య అమాంతం పెరిగిపోవడం పట్ల కూడా అనుమానాలు తలెత్తాయి. లోక్‌సభ ఎన్నికలలో 9,28,90,445 మంది ఓటర్లు నమోదు కాగా, కేవలం ఆరు నెలల లోపే, నవంబర్ 2024 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో 9,77,93,350 మంది ఓటర్లు నమోదయారు.

## మోడల్ ప్రవర్తనా నియమావళి

ఎన్నికల కమిషన్ జారీ చేసిన మోడల్ ప్రవర్తనా నియమావళిని గాని, ఎప్పటికప్పుడు ఇసి విడుదల చేసే సూచనలను గాని అమలు పరచకపోవడం ఆందోళన కలిగిస్తోంది. 2024 ఎన్నికల సమయంలో ఇసి నిర్వహించే ఇ–విజిల్ యాప్‌కు వేలాది ఫిర్యాదులు వచ్చాయి.

చట్ట విరుద్ధంగా ప్రదర్శిస్తున్న హోర్డింగులు, బ్యానర్లు గురించి, మద్యం పంపిణీ గురించి. ఓటర్లకు బహుమతుల పంపిణీ గురించి చేసిన ఫిర్యాదులలో చాలా వాటికి ఇసి స్పందించింది. ఐతే మతం పేరుతో, కులం పేరుతో ఓటర్లకు అభ్యర్థులు, రాజకీయ

పార్టీలు విజ్ఞప్తులు చేసిన సందర్భాల గురించి చేసిన ఫిర్యాదుల విషయంలో ఎన్నికల కమిషన్ చేతకానట్టు ఉండిపోయింది. ప్రార్థనా స్థలాలను ఎన్నికల కోసం దుర్వినియోగం చేసినట్టు దాఖలైన ఫిర్యాదుల విషయంలోనూ అంతే.

ప్రధానిపై దాఖలైన అనేక ఫిర్యాదులను పరిశీలించడానికి ఎన్నికల కమిషన్ మొదట్లో పూర్తిగా నిరాకరించింది. ప్రధానమంత్రి మోడీ పచ్చి మత విద్వేషపూరిత ప్రచారానికి బహిరంగంగా పాల్పడినా , ప్రజల మధ్య చర్చ విషయంలో పాటించవలసిన ప్రమాణాల గురించి ఎన్నికల కమిషన్ చేసిన సూచనలను బేఖాతరు చేస్తూ ప్రచార స్థాయిని దిగజార్చినా, ఎన్నికల కమిషన్ సంబంధిత ఫిర్యాదులపై స్పందించడానికి ఈ విధంగా నిరాకరించడం చాలా ఘోరం.

ప్రధాన మంత్రి, హోం మంత్రి, తదితరులు అధికార దుర్వినియోగానికి పలుమార్లు పాల్పడిన ఉదంతాలు ఉన్నాయి. తమ సంకుచిత ప్రయోజనాల కోసం జాతీయ చిహ్నాలను సైతం వారు దురుపయోగం చేశారు. పాలకపార్టీ మునుముందు 'ఆపరేషన్ సిందూర్' ను సైతం తన ఎన్నికల ప్రయోజనాలకోసం వాడుకోనుందని ఘంటాపథంగా చెప్పవచ్చు.

మోడల్ ప్రవర్తనా నియమావళిని సకాలంలో అమలు జరిగేట్టు చర్యలు చేపట్టకపోతే ఇసి ప్రతిష్ఠను పునరుద్ధరించడం సాధ్యం కాదు. ఎన్నికల కమిషన్ నిష్పాక్షికంగా వ్యవహరించడమే కాదు, అలా వ్యవహరిస్తున్నట్టు అన్ని రాజకీయపార్టీలూ, సాధారణ ప్రజలూ విశ్వసించేలా చూసుకోవడం ఇసి బాధ్యత.

## నేర చరిత్రలు

పోటీలో ఉన్న అభ్యర్థులకు గతంలో ఉన్న నేర చరిత్రలను వెల్లడి చేయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలు ప్రజల ఎంపికను పెద్దగా ప్రభావితం చేయలేదన్నది కనిపిస్తూనేవుంది. ఆ ఆదేశాల వలన జరిగిందేమంటే అటువంటి నేర చరిత్రలు కల అభ్యర్థులు, వారి పార్టీలు  ఎన్నికలలో చేసిన ఖర్చు విపరీతంగా పెరిగిపోయింది. సిపిఐ(ఎం) కు సంబంధించినంతవరకూ తన అభ్యర్థులకు ఉన్న పూర్వ నేర చరిత్ర యావత్తూ వారు చేపట్టిన రాజకీయ కార్యకలాపాల సందర్భంగా వారిమీద నమోదైన కేసులే. వారు ఎటువంటి తీవ్ర నేరాలకూ పాల్పడలేదు. మా పార్టీకి, మా వంటి తక్కిన పార్టీలకు నిధుల కొరత తీవ్రంగా ఉంటుంది. అందుచేత మా అభ్యర్థుల పూర్వ నేర

చరిత్రల గురించి పలు మార్లు అనేక మాధ్యమాలలో ప్రచురించడం, ప్రసారం చేయడం చాలా ఖర్చుతో కూడుకున్న భారం.

అంతే కాక, ఎన్నికల సమయంలో చాలా మీడియా సంస్థలు తమ ప్రకటనల చార్జీలను పలు రెట్లు పెంచి సొమ్ము చేసుకోడానికే ఈ ఆదేశం తోడ్పడుతుంది.

అసెసియేషన్ ఫర్ డెమాక్రటిక్ రైట్స్ నివేదిక ప్రకారం గెలిచిన 543 మంది లోక్‌సభ సభ్యులలో 251 మంది, అంటే 46 శాతం, తమపై క్రిమినల్ కేసులు ఉన్నవారే. వారిలో 170 మంది, అంటే, 31 శాతం మంది మీద మానభంగం, హత్య, కిడ్నాప్ వంటి తీవ్ర నేరాలు మోపబడ్డాయి.

దీనిని బట్టి ఓటర్లకు అభ్యర్థుల నేర చరిత్ర తెలియజేయడం వలన మెరుగైన తీర్పును ఓటర్లు ఇవ్వగలుగుతారు  అన్న కోర్టు ఉద్దేశ్యం నెరవేరలేదని స్పష్టం ఔతోంది. సరైన సమాచారం తెలియకపోవడం వలన ఓటరు తన తీర్పు ఇవ్వలేకపోతున్నాడన్నది కాదు. హత్యలు, మానభంగాలు, కిడ్నాప్‌లు చేసిన అభ్యర్థులు గెలవడానికి కారణాలు వేరే ఉన్నాయి.

ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ సుప్రీం కోర్టులో ఒక రివ్యూ పిటిషన్ వేయాలి. గతంలో ఇచ్చిన తీర్పును అమలు చేసిన అనంతరం వచ్చిన అనుభవాల వెలుగులో ఆ తీర్పును పునఃసమీక్ష చేయాలని కోరాలి.

## ఎన్నికల కమిషన్‌ను సంస్కరించడం

ఒక స్వతంత్ర, రాజ్యాంగబద్ధ వ్యవస్థగా ఎన్నికల కమిషన్ నిర్వహించవలసిన పాత్ర అది నిర్వహించగలిగేలా, దాని స్వతంత్రతను, స్వయం నిర్ణయాధికారాన్ని బలపరచాలి.  ఈ అవగాహన తోటే మా పార్టీ 2023లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తోంది. రాజ్యాంగ ధర్మాసనం  తీర్పు ప్రకారం  ముఖ్య ఎన్నికల కమిషనర్‌ను, ఎన్నికల కమిషనర్లను ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ నియమించాలి.

ఐతే అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పును దెబ్బ తీస్తూ ప్రభుత్వం ఒక చట్టం చేసింది. దాని ప్రకారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండవలసిన స్థానంలో కమిటీలో ఒక కేంద్ర క్యాబినెట్ మంత్రి ఉంటారు. ఆ మంత్రిని ప్రధాని నామినేట్ చేస్తారు. అంటే అధికారంలో ఉన్న పక్షం మాటే ఎన్నికల కమిషన్

నియామకంలో నెగ్గుతుంది. ఇది ఎన్నికల కమిషన్ నిష్పాక్షికతను, స్వతంత్రతను నాశనం చేసే చర్య అని మేం బలంగా విశ్వసిస్తున్నాం.

ఎన్నికల కమిషన్ స్వతంత్రత, స్వయంనిర్ణయాధికారం బల పడాలంటే దాని జవాబుదారీ తనం కూడా పెరగాలి. 2024 ఎన్నికలు జరిగిన తీరు ఎన్నికల కమిషన్ నిబద్ధతను, విశ్వసనీయతను, నిష్పాక్షికతను ప్రశ్నార్థకంగా మార్చింది. ఈ విషయం ఎంత కొట్టవచ్చినట్టు వ్యక్తం అయిందంటే కొంతమంది పూర్వపు ఎన్నికల కమిషనర్లు సైతం తమ ఆందోళనలను తెలియజేశారు.

ఈ అంశాన్ని పరిశీలించి సరిదిద్దాలి.

ప్రతులు : 2000 ప్రచురణ కాలం : జూన్, 2025 వెల : _. 5/-

166832

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ

27-30-9, గవర్నర్‌పేట, విజయవాడ - 2

ఫోన్ నెం. 0866-2577202